'ప్రజా పాలన'ను పొడిగించాలి



పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీల పథకం ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఆఖరిరోజు కావడంతో ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ తమ అప్లికేషన్లను సమర్పించారు. జాంబాగ్ డివిజన్‌లో కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో పాటు తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజలకు ఉన్న సందేహాలను తీరుస్తూ.. ప్రజాపాలన దరఖాస్తులను అధికారులకు అందేలా చూశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ మాట్లాడుతూ... ప్రభుత్వం మరికొన్ని రోజులకు ఈ కార్యక్రమాన్ని పొడిగించాలని ఆయన కోరారు. సరైన అవగాహన లేకుండా దరఖాస్తులు చేసుకోలేదని ఆయన అన్నారు. ఒక శాతం ప్రజలు దరఖాస్తు చేసుకునేలా మరిన్ని రోజులు ప్రజాపాలన కార్యక్రమాన్ని కొనసాగించాలని తమను ప్రజలు కోరుతున్నారన్నారు.

ఇంకెన్నాళ్లీ ఎదురు చూపులు?

- మీరాలంమండిలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
- మురుగు కలిసిపోవడంతో కలుషిత నీటిసరఫరా
- నిజాంకాలం నాటి పైపులైన్లతో తలెత్తుతున్న సమస్యలు

చార్మినార్: జలమండలి అధికారుల అలసత్వం.. సిబ్బంది నిర్లక్ష్యంతో పాతబస్తీ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు ముందుకురాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటి సమస్యలను సంబంధిత జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా...నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కలుషితంగా వస్తున్నాయని స్థానికుల నుంచి అందే ఫిర్యాదులను జలమండలి సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నెలల తరబడి కలుషిత నీటి కష్టాలు తీరడం లేదు..

- సరఫరా అవుతున్న నీరు కలుషితమై రంగుమారి దుర్వాసనతో వస్తున్న నీటిని వేడిచేసి వడపోసి శుభ్రం చేసుకుంటున్నామని, ఇది రెండు రోజులకోసారి తప్పనిసరిగా చేయాల్సి వస్తుందంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్లు, తాగునీటి పైపులైన్లు కలిసి ఉన్నాయి.

నిజాంకాలం నాటివి సమాంతరంగా..

- కొన్ని ఇంకా నిజాం కాలంనాటి డ్రైనేజీలు బస్తీల్లో సమాంతరంగా ఉన్నాయి. ఈ డ్రైనేజీ పొంగి మురుగు, కుళాయి నీటి పైపుల ద్వారా కలిసిపోయి కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మీరాలంమండిలో పొంగుతున్న మురుగు

డ్రైనేజీ పొంగి మురుగు రోడ్లపై పారుతూ...

- పాతబస్తీలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ.. మురుగు రోడ్లపై పారుతున్నా... సంబంధిత జలమండలి అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని పాతబస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు పొంగి మురుగు రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తోందని వాపోయారు. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి.
- పాదచారులు, స్కూల్ సమయాల్లో విద్యార్థులు రోడ్లపై పేరుకుపోతున్న మురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత జలమండలి ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్‌ను పునరుద్ధరించండి..



మీరాలంమండిలో నిజాం కాలంనాటి పురాతన డ్రైనేజీ పైపులైన్‌ను పునరుద్ధరించాలి. ఏళ్ల తరబడి తమకు కలుషిత నీటి సమస్యతో పాటు మీరాలంమండి ప్రధానరోడ్డు వద్ద నిత్యం డ్రైనేజీ మురుగు పారడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. సాధ్యమైనంత వెంటనే సమస్యను పరిష్కరించాలి. – చలువాది మనోజ్, మీరాలంమండి

మూసీలో కలిసే ప్రధాన పైపులైన్‌లో కలపాలి..



మీరాలంమండిలో రోజూ డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. పురాతన పైప్‌లైన్‌ను మార్చి మూసీనదికి కలిసే ప్రధాన పైపులైన్లో కలపాలి. నగరంలోని పలు ప్రాంతాల నుంచి మీరాలంమండికి వచ్చే వినియోగదారులతో పాటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
– సయ్యద్ హమీద్, కిరాణా అండ్ జనరల్ మర్చంట్

కాంగ్రెస్‌పై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్



గౌరీసతీష్

అబిడ్స్: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఓర్వలేకనే బీఆర్‌ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు తిరస్కరించినా.. వారికి కనువిప్పు కావడంలేదన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనతో ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేసి తీరుతామన్నారు. బీఆర్‌ఎస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో 15 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రం నలుమూలలా అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. ఉచితబస్సు ప్రయాణంతో మహిళా లోకమంతా ఎంతో సంతోషంగా ఉన్నారని, మిగతా ఐదు గ్యారంటీలు త్వరలోనే అమలు చేస్తామన్నారు.

గుడిమల్కాపూర్‌లో అయోధ్య అక్షింతల పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

అబిడ్స్: అయోధ్య అక్షింతలను గుడిమల్కాపూర్ మహేష్‌నగర్ కాలనీలో ఇంటింటా పంపిణీ చేశారు. శనివారం రథంలో అక్షింతలను తీసుకుని ఇంటింటికీ తిరిగి అయోధ్య రామమందిర వివరాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈనెల 22న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సంబరాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహేష్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నం సుబ్బారావు, అసోసియేషన్ ప్రతినిధులు న్యాయవాది రాజశేఖర్, ముల్లే రాకేష్, నరసింహాగౌడ్, సీహెచ్ ప్రదీప్‌కుమార్, గౌరిగే శ్రీనివాస్, శ్రీధర్, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, రఘు, కిషోర్ గుప్తాలు కాలనీవాసులకు అవగాహన కల్పించారు. 500 ఏళ్ల తర్వాత ప్రారంభమవుతున్న అయోధ్య ఆలయం వేడుకను దీపావళి తరహాలో ఇంటింటా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంట్లో ఐదు దీపాలను వెలిగించి 22న సాయంత్రం దీపావళి శోభ ఉండేలా కాలనీ శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కాలనీలోని ప్రతి ఇంట్లో దీపావళి పండుగ వాతావరణం కొనసాగాలని విన్నవించారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం చేస్తే తగిన చర్యలు

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్



టోలిచౌకి నదీమ్ కాలనీలో పర్యటిస్తున్న కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకి డివిజన్‌లోని నదీమ్‌కాలనీ, రియాసత్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. నదీమ్‌కాలనీని వరదముంపు నుంచి నివారించేందుకు డ్రైనేజీపనులు జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం కంటే ముందే ఈ పనులు పూర్తైతే అనుకున్న ఫలితం సాధించవచ్చన్నారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా వస్తున్న వర్షపునీటితో నదీమ్‌కాలనీ వరద ముంపునకు గురయ్యేదన్నారు. గత పదేళ్లల్లో నదీమ్ కాలనీకి వరద ముంపు బాగా తగ్గిందన్నారు. డ్రైనేజీ పైపులైన్, శాతం చెరువుకు అదనపు తూమ్‌లు ఏర్పాటు చేయడంతో వరదనీరు ఎప్పటికప్పుడు శాతం చెరువుగుండా బయటకు వెళ్లిపోతుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తయితే నదీమ్ కాలనీకి శాశ్వతంగా వరద ముంపు తప్పుతుందన్నారు.

ప్రజా పాలన కేంద్రాల పరిశీలన...

గోల్కొండ, నానల్‌నగర్ తదితర డివిజన్‌లలో కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పలువురు ఆయనకు తమ సమస్యలను వివరించారు. దరఖాస్తుతో పాటు వివిధ పథకాలకు దరఖాస్తుతో పాటు ఆదాయ, కుల ధ్రువపత్రాలను కూడా జత చేయాలని అధికారులు కోరుతున్నారని ఇప్పటికప్పుడే తాము ఆదాయ, కుల ధ్రువపత్రాలు పొందేది ఎలా అని వారు ఎమ్మెల్యే ముందు తమగోడు వెల్లబుచ్చారు. వాటి అవసరం లేకుండానే ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు జిరాక్స్ మాత్రమే దరఖాస్తుతో జతచేయాల్సి ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని తాను సీరియస్‌గా తీసుకుని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొస్తానని హెచ్చరించారు. దరఖాస్తుదారుడికి రశీదు ఇవ్వాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి

గౌలిపురా: డివిజన్‌లోని ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్ అంబికానగర్‌లో నూతన సివరేజ్ పైపులైన్ పనులను శనివారం ఆమె ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డివిజన్‌లో పర్యటించిన ప్రజలు మురుగు సమస్య ఉందనే విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులకు రూ.2 లక్షల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. దీంతో సివరేజ్ పైపులైన్ పనులను ప్రారంభించామన్నారు. జలమండలిలో నిధుల కొరతతో డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో సివరేజ్ పైపులైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బస్తీవాసులు ఆర్.లక్ష్మణ్, శివాజీ, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి సుమన్‌కుమార్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు రఘుకాంత్, రమేష్‌యాదవ్, జమాల్‌పూర్ అశోక్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి రంగప్రవేశం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాంస్కృతిక సంస్థ దీపాంజలి డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు దీపికారెడ్డి శిష్యురాలు నల్లారి హెత్విత కూచిపూడి రంగప్రవేశం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. గణేష స్తుతి, త్యాగరాజ కీర్తనలు, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతను శాస్త్రీయ, సంగీత కళల పట్ల రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, జాతీయ సంగీత నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య, శాసన సభ్యులు చక్రపాణిరెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పద్మశ్రీ సునిత కోహ్లీ, నగర పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, తల్లిదండ్రులు ఎన్.నిరూప్‌కుమార్‌రెడ్డి, రూపన తదితరులున్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

విజయనగర్‌కాలనీ: చిన్న ఉద్యోగంలోనైనా చేరి కృషి, పట్టుదల, అంకిత భావంతో పనిచేస్తూ.. అదే సంస్థలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం మల్లేపల్లి ఐటీఐలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఎప్పటికప్పుడు తమ విద్యార్హతలను మెరుగుపరచుకుంటూ.. పోటీ పరీక్షల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆఫర్స్ లెటర్లను అభ్యర్థులకు ఎమ్మెల్యే అందజేశారు.

ఘనంగా పైనీర్ ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

దూద్‌బౌలి: పాతబస్తీ దూద్‌బౌలి ఉందాబజార్‌లోని పైనీర్ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో శనివారం పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ దోరేటి ఆనంద్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమంలో బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ (రాహుల్), బహదూర్‌పురా బీజేపీ ఇన్‌చార్జి నరేష్ తదితరులతో పాలు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నేడు ఉచిత ఆర్థోపెడిక్ క్యాంప్

గోల్కొండ: నేడు ఉచిత ఆర్థోపెడిక్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు షేక్‌పేట్ ఓయూ కాలనీలోని పీవీజీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఎస్.పాలకూరి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ఈ క్యాంపు ఉంటుందని వివరించారు. ఉచిత వైద్యపరీక్షలతో పాటు బీఎండీ స్కానింగ్ ఉచితంగా చేస్తామని, రిజిస్ట్రేషన్ మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన నంబరు 9989346471.

ఆరు గ్యారంటీలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను మిగిలిన వారు తహసీల్దార్ కార్యాలయం, జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆరు గ్యారంటీ పథకాలకు చివరిరోజు కావడంతో ఈ సందర్భంగా హనుమాన్‌నగర్ బస్తీ దవాఖానాలో దరఖాస్తుదారుల నుంచి ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీపీసీసీ కార్యదర్శి కృష్ణకుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్, డీసీఎం శ్రీనివాస్ తదితరులున్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపు మహిళలకు కాంగ్రెస్ పార్టీ తరఫున నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంబీటీ నేత ఖాయంఖాన్‌కు ఘన నివాళి

చార్మినార్: స్వర్గీయ డాక్టర్ ఖాయంఖాన్ మరణం తమ పార్టీకి తీరని లోటును మిగిల్చిందని ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్ అన్నారు. మజ్లిస్ బచావ్ తహ్రీక్(ఎంబీటీ) మాజీ అధ్యక్షుడు, దివంగత డాక్టర్ ఖాయం ఖాన్ 7వ వర్ధంతిని పురస్కరించుకుని ఎంబీటీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముస్తఫా మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఘర్షణ

కేసు నమోదు

విజయనగర్‌కాలనీ : ఎంఐఎం, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాపాలనలో కేంద్రంలో ఒకరినొకరు దూషించుకుని తోపులాడుకోవడంతో టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌లోని కేహెచ్‌కే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కేంద్రానికి కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్ తన అనుచరులతో వచ్చి శనివారం మధ్యాహ్నం సందర్శించాడు. దరఖాస్తు ఫారాలు డబ్బులకు విక్రయిస్తున్నారని, దరఖాస్తు ఫారాలు నింపేందుకు కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ.. ఎంఐఎం కార్యకర్తలతో ఆయన వాగ్వాదానికి దిగాడని సమాచారం. ఇరు పార్టీల కార్యకర్తలు పెద్దఎత్తున టప్పాచబుత్ర పీఎస్‌కు చేరుకోవడంతో సమాచారం అందుకున్న అడిషనల్ డీసీపీ మహ్మద్ అశ్వక్, ఆసీఫ్‌నగర్, కుల్సుంపురా ఏసీపీలు రాజావెంకట్‌రెడ్డి, ఎంఏ జావేద్‌లు పరిస్థితిని తెలుసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అక్రమ స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

ఐదుగురు మహిళలతో పాటు మరో వ్యక్తి అరెస్టు

అబిడ్స్: మసాజ్ పేరుతో అక్రమంగా కొనసాగిస్తున్న స్పా కేంద్రాలపై గుడిమల్కాపూర్ పోలీసులు, సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఐదుగురు మహిళలతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ షేక్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. నానల్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జన్నత్, గోల్డెన్ అనే రెండు స్పా కేంద్రాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు మహిళలతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు స్పా కేంద్రాలు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. స్పా, స్నూకర్, రిక్రియేషన్‌క్లబ్‌లకు ఇళ్లను అద్దెకిచ్చి కేసుల్లో ఇరుక్కోవద్దని ఇళ్ల నిర్వాహకులకు ఇన్‌స్పెక్టర్ సూచించారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలపై విచారణ చేపట్టాలి



సునీల్‌శర్మకు వినతిపత్రం అందజేస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

నాంపల్లి : అసెంబ్లీ ఎన్నికల ముందు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల అక్రమ బదిలీలలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సచివాలయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎక్సైజ్ శాఖ) సునీల్ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై ఉన్నతాధికారులతో పాటు మాజీ మంత్రులను కూడా విచారించాలని ఆయన కోరారు. ఎక్సైజ్‌శాఖలో ఎన్నో ఏళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు లేకుండా చాలా మంది ఇన్‌స్పెక్టర్లు ఆయా పోలీస్‌స్టేషన్లలో 8 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకోవాలని కోరారు. గతంలో చేసిన బదిలీలను రద్దు చేసి, న్యాయబద్ధంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు అనుదీప్‌గౌడ్, లక్ష్మణ్, మన్నెం తదితరులున్నారు.

స్టాఫ్ నర్సుల నియామకాన్ని రద్దు చేయాలి

కోఠి మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసు వద్ద భారీ ధర్నా



సుల్తాన్‌బజార్: లోప భూయిష్టంగా నిర్వహించిన స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోఠిలోని తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయం ఎదుట అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ.. అర్హులైన నర్సింగ్ అభ్యర్థులకు నియామకాల్లో అన్యాయం జరిగిందని, ఈ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని కోరారు. దీనిపై ఏసీబీ దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ సర్టిఫికెట్లు పెట్టినవారికి మెరిట్ లిస్టులో పేరు ఉంచిన రిక్రూట్‌మెంట్ బోర్డు అర్హులైన వారిని కూడా తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు వేలమందికి అన్యాయం జరిగిందని వాపోయారు. ఇప్పటికైనా ఈ నియామక ప్రక్రియను రద్దు చేయాలని లేని పక్షంలో వేలాది మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దరఖాస్తుదారులకు అధికారులు సహకరించాలి



ప్రజాపాలన కేంద్రాన్ని సందర్శించిన కాంగ్రెస్ నేతలు

గోల్కొండ: కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాస్తులు చేసుకోని వారు భయపడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ డివిజన్‌లోని ప్రజా పాలన కేంద్రాలను సందర్శించారు. దరఖాస్తు చేసుకోలేని వారికి ప్రభుత్వం తిరిగి అవకాశం ఇస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటి దాకా వచ్చిన దరఖాస్తులను వెంటనే ప్రభుత్వం పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేస్తుందన్నారు. హామీలను నిలపెట్టుకునే పార్టీ కాంగ్రెస్ ఒకటేనని అభిప్రాయపడ్డారు. అధికారంలో వచ్చిన నెలరోజుల్లోపే ఎన్నికల హామీలను అమలుచేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

చార్మినార్: పాతబస్తీలోని అన్ని వర్గాల ప్రజలు ప్రజాపాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రచార, ప్రణాళిక కమిటీ కన్వీనర్ అలీ మస్కతి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకున్నారన్నారు. ప్రజాపాలన ముగింపు సందర్భంగా శనివారం చార్మినార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షులు సమీర్‌వలీ ఉల్లా తదితరులతో కలిసి ఆయన పాతబస్తీ చార్మినార్‌లోని పలు కేంద్రాలను ఆయన సందర్శించి దరఖాస్తుల వివరాలను సేకరించారు. అర్హులైన పేదలందరూ ఆరు గ్యారంటీల అమలుకు అర్జీలు పెట్టుకున్నారన్నారు.

ప్రజాపాలనకు విశేష స్పందన

చార్మినార్: ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీసెల్ ఉపాధ్యక్షులు కాశమోనీ శ్యామ్ రావుముదిరాజ్ అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం లలితాబాగ్‌లోని కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తుదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మొదటి దశ ప్రజాపాలన కార్యక్రమం ముగిసిందని, ఎవరైనా దరఖాస్తులు అందజేయకపోతే నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ రెండో దఫా కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. అశోక్, ప్రభు, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



ప్రత్యేక పూజల్లో దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ తాళ్లగడ్డలోని తొట్ల పోచమ్మ బొడ్డురాయి నాభిశిల ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల రాజగోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి నారెడ్డి దుర్గాదాస్‌యాదవ్, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తాళ్లగడ్డ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వందరోజుల్లో అన్ని గ్యారంటీలు

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వందరోజుల్లో పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీసెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యామ్‌రావుముదిరాజ్ పేర్కొన్నారు. లలితాబాగ్ డివిజన్‌లోని సరస్వతీ శిశువిద్యామందిర్‌లో చివరిరోజు ఆయన స్థానిక ప్రజలకు గ్యారంటీ పథకాల ఫారాలను అందజేశారు. చదువురాని వారికి దరఖాస్తు ప్రక్రియలో సహకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే న్యాయం జరుగుతుందన్నారు. దరఖాస్తు కేంద్రంలో పేదలకు అన్ని విధాల సహకరించిన సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు అశోక్, ప్రభు, లక్ష్మణాచారి తదితరులున్నారు.

టీఎన్జీఓ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్ : అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, టీఎన్జీఓస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో 500 మంది ఇన్‌పేషంట్ అటెండర్లకు పరిశుభ్రమైన ఆహారాన్ని పంపిణీ చేశారు. ఎంఎన్‌జే ఆసుపత్రిలో ప్రత్యేకంగా నెలలో రెండుసార్లు లేదా మూడుసార్లు పేదవారికి ఆహారం అందించడం మరింత సంతృప్తిని, ఆశీర్వాదాలను ఇస్తుందన్నారు. కుటుంబం, స్నేహితులు, యూనియన్ సభ్యుల మద్దతు లేకుండా ఈ పని అసాధ్యమన్నారు. వైస్ ప్రెసిడెంట్ కుర్రాడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్రి, ఎంఎన్‌జే యూనిట్ సెక్రటరీ శివకుమార్, ఈఎస్సై రాజ్‌కుమార్, మహ్మద్ చౌవూష్ తదితరులున్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) స్కీమ్‌లో గత 20 ఏళ్లుగా దాదాపు 15 వేల మంది ఉద్యోగులు వివిధ కేటగిరిలో కాంట్రాక్టు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్నటువంటి ఈ స్కీమ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వాలు గతంలో తీవ్ర అన్యాయం చేశాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల బేసిక్ వేతనం కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాల్సి ఉండగా.. గత ప్రభుత్వం అమలు చేయకుండా కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. భవిష్యత్తులో వీరికి 2016 సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం.. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్నా, బాపుయాదవ్, ఎస్.వరలక్ష్మి, విష్ణుమూర్తి, రాజేశ్వరి, బాలసుబ్రమణ్యం, నరసింహ, సుమన్, ఎన్‌హెచ్‌ఎం నాయకులు రేణుక, స్వరూప, మధుసూదన్, ఉప్పలయ్య, రాజు తదితరులున్నారు.

ఉద్యోగులు సంఘటితం కావాలి..

నాంపల్లి : అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఉద్యోగులందరూ సంఘటితం కావాలని నిలోఫర్ ఆసుపత్రి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డి.రవీందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నిలోఫర్ ఆసుపత్రిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం శనివారం నిలోఫర్ ఆసుపత్రిలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. పేషంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలు రూ.15 వేలకు పెంపు, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లింపు, ఏడాదికి 15 రోజుల సాధారణ సెలవుల అమలు, ఆరోగ్యశ్రీ సిబ్బందికి వేతనంలో 30 శాతం ఇంక్రిమెంట్, ఔట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా 5 రోజుల సెలవులు అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే తదుపరి కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. సంఘం కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, నేతలు ఎల్లేశం, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, సురేష్, శ్రీనునాయక్, వెంకట్, ప్రసాద్, నిర్మలదేవి, రేఖ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి దూకిన వ్యక్తి

చాంద్రాయణగుట్ట: మద్యం మత్తులో ఓ వ్యక్తి రైల్వే ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకిన ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ భోజ్యానాయక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కందికల్‌గేట్ ఫ్లైఓవర్‌పై ఛత్రినాక నుంచి చాంద్రాయణగుట్ట వెళ్లే రూట్‌లో ఓ వ్యకి అకస్మాత్తుగా కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సదరు వ్యక్తి పేరు మణికంఠ(40) అని చెప్పినట్లు సమాచారం. అతడికి మతిస్థిమితం కూడా సరిగ్గా లేనట్లుగా పోలీసులు భావిస్తున్నారు. తాగిన మైకంలోనే దూకాడా..? మరేమైనా ఇతర కారణాలున్నాయా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.